IJCRT.ORG ISSN : 2320-2882
INTERNATIONAL JOURNAL OF CREATIVE RESEARCH THOUGHTS (IJCRT)
An International Open Access, Peer-reviewed, Refereed Journal

# "పి.వి.ఆర్. శివకుమార్ కథలు పర్యావరణ చిత్రణ"

కట్టా సత్య హరీష్
పరిశోధక విద్యార్థి,
తెలుగుశాఖ,
ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

పర్యవేక్షకులు
ఆచార్య నేమాని శారద
తెలుగు అధ్యాపకురాలు
డా॥ వి.యస్. కృష్ణా డిగ్రీ
ప్రభుత్వ కళాశాల
విశాఖపట్నం

సహపర్యవేక్షకులు
ఆచార్య జర్రా అప్పారావు
తెలుగు ప్రొఫెసర్, తెలుగు శాఖ
ఆంధ్ర విశ్వకళాపరిషత్, విశాఖపట్నం.

మనిషి అతని చుట్టూ ఆవరించి ఉన్నవన్నీ పర్యావరణంలో భాగమే. గాలి, నీరు, నేల వాతావరణం, చెట్లు, కొండలు, అడవులు వంటివెన్నో ఈ జీవావరణాన్ని ఆవహించాయి. అవి సజీవ, నిర్జీవాలుగా ఉండి ఏదో ఒక ఉపయోగంతో ప్రకృతి సమతుల్యతకు, జీవ మనుగడకు తమవంతు సహకారంతో ఉంటుంటాయి. ఏ ఒక్కటి నిర్లక్ష్యమైనా దాని ప్రభావం పర్యావరణంలోని ఇతరత్రాలపై ప్రత్యక్ష, పరోక్షాలుగా ఉంటుంటాయి. ముఖ్యంగా మనిషివల్లే పర్యావరణం యావత్తూ అనేక విధాలుగా నాశనం అవుతోంది. అలాంటప్పుడు మనిషి తప్పుల్ని ఎత్తి చెప్పి సరిచేయాల్సిన అవసరాన్ని రచయిత గుర్తించారు. పర్యావరణ విశిష్టతలు, పర్యావరణ సమస్యలు, పర్యావరణ చైతన్యం అన్నవి ప్రతీ ఒక్కరూ తెలుసుకుని ప్రకృతిని నిలబెట్టుకోవాలి. లేదంటే పర్యావరణ అసమతుల్యతలు జీవ సమాజంపై దుష్ప్రభావాలను చూపుతాయి. గతానికి ఇప్పటికీ ఎంతో నాశనమైన ప్రకృతి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావాలను చూపబోతోంది. ఇదంతా తెలుపుతూ మానవ స్వార్థం ఎన్నో విధాలుగా పర్యావరణంపై విరుచుకుపడటాన్ని ప్రశ్నించారు. ఆ ఫలితాలు తెలిపి బాధ్యతని, చైతన్యాన్ని ప్రకృతి పట్ల పెంచుకోవాలని కథల ద్వారా కోరారు.

పి.వి.ఆర్. శివకుమార్‌గా పేరు గాంచిన రచయిత పూర్తిపేరు పిన్నిల్లి వెంకట రామ శివకుమార్. పూర్వీకుల నివాసం విజయవాడ. ఈయన మద్రాసులో 1951 నవంబర్ 25న జన్మించారు. ఈయన తండ్రి 1940 దశకంలో పి.వి.ఆర్. నరసింహరావుగారు. ఈయన ఆంధ్ర యూనివర్శిటీలో బికాం ఆనర్స్ చేశారు. ఏజిస్ ఆఫీస్‌లో మద్రాస్‌లో ఉద్యోగం కూడా చేశారు. 1956 తరువాత ఆంధ్రప్రదేశ్ ఏర్పడటంతో, ఏజిస్ ఆఫీస్ హైదరాబాద్ రావటంతో ఉద్యోగ రీత్యా అక్కడకు వెళ్ళారు. అయితే మరో ఏడాదికే, తండ్రి స్వర్గస్తులుకావటంతో, మరలా తల్లిగారి ఊరైన విజయవాడలో నివాసం ఏర్పరచుకున్నారు. తల్లి కనకదుర్గాంబ మరియు తాత గారి ఆధ్వర్యంలో క్రమశిక్షణతో పెరిగారు.

## కిరణం కథ

పిల్లల పెళ్ళిళ్ళు, పదవీ విరమణ అనంతరం భద్రయ్య, శాంత దంపతులు తమ స్వగ్రామంలో స్థిరపడతారు. భద్రయ్య కొడుకు సుందరం, కోడలు అమిత ఉన్నతోద్యోగులు. వారి కుమారుడు హవిస్ ఎప్పుడూ ఏదో ఒక అనారోగ్యంతో బాధపడుతూ మందులతో గడిపేవాడు. ఓసారి భద్రయ్య మనవడిని చూడటానికి వస్తాడు. దగ్గు, జ్వరం, అలసట, చర్మం సమస్యలు, ఎముకలు, కండరాల నొప్పులతో తోటకూరకాడలా ఉన్న హవీస్‌ని చూస్తాడు. ఇంట్లో, బడిలోనూ ఎయిర్ కండిషన్లు, బ్రాండెడ్ పాక్డ్ ఫుడ్స్, రెడీటూ ఈట్ కర్రీతో ఎంతో జాగ్రత్తగా చూసుకుంటున్నామని సుందరం దంపతులంటారు. మనవడికి టి.బి. సోకిందని తెలియగానే భద్రయ్య ఇక పిల్లాడిని తనతో పల్లెకు తీసుకెళ్ళిపోతాడు. అక్కడ వేకువజామున చెరువు గట్టుపై నడక, సూర్యనమస్కారాలతో హవీస్ రోజు ప్రారంభం అయ్యేది. గుమ్మపాలు, గింజలు, తేనె, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు ఆహారం శరీరానికి సహజ నూనెల మర్దనాని అతనికి అందించేవారు. నెల రోజుల తర్వాత వచ్చి ఆరోగ్యంతో కళకళలాడుతున్న హవీస్‌ని చూసి సుందరం పొంగిపోతాడు. పట్టణవాసపు కాలుష్యాలు, జీవన విధానం, ఆహారాల విషతుల్యం హవీస్‌పై ఎలా ప్రభావం చూపాయో భద్రయ్య, సుందరానికి వివరిస్తాడు. కొడుకుని తండ్రి వద్దే వదిలిపెట్టి సుందరం ఊరెళ్ళిపోతాడు.

## విశ్లేషణ

పర్యావరణ కాలుష్యాలు ప్రకృతికే కాకుండా ప్రజారోగ్యాలకు కంటకాలన్న వాస్తవాన్ని తెలిపే క్రమంలో చైతన్యాన్ని ఈ కథ ప్రబోధించింది. ఒక సమస్యకి కారణాలు సమస్యలు, ప్రభావాలు, ఫలితాలు అనే చర్చ పర్యావరణాన్ని సమీక్షిస్తూ చేయగలగటం ఈ కథకు ప్రత్యేకతనిచ్చింది. అందుకే దీన్ని పర్యావరణ సమస్య, చైతన్యం అనే ఏ ఒక్క విభాగానికో చెందినదిగా కాక సంపూర్ణంగా విశ్లేషించినపుడే ప్రయోజనం నెరవేరగలదు. ఆ విధంగానే పరిశీలించటమైంది. మనిషి ప్రకృతి తోడుగా సృష్టించబడి పర్యావరణంలో మనిషి ఓ భాగమయ్యాడు. కానీ మానవాభివృద్ధి తరాలుగా జరుగుతోన్న ప్రక్రియగా ప్రకృతిని నాశనం చేస్తూ పర్యావరణంలో మార్పులకు కారకమై విధ్వంసాలు, విపత్తులకు దారి తీయిస్తోంది. అలాంటప్పుడు కలుషితం అన్నది గాలి, నీరు, నేల, నింగి వంటి వాటిల్ని విషతుల్యాలుగా మారుస్తోంది. దీంతో అవి ప్రత్యక్ష పరోక్షాలుగా జీవరాశిపై దారుణ ప్రభావాలకు గురి చేస్తున్నాయి. అది సమస్త సృష్టికే, మానవజాతి మనుగడకే ప్రశ్నార్థకమైంది. దీనంతటినీ ఉదహరిస్తున్న కథగా సమాజాన్ని అప్రమత్తం చేస్తోంది. ఆధునిక కాల జీవనశైలి కూడా ప్రకృతి విరుద్ధమైందన్న వాదనని కూడా ప్రస్తావించింది. ఆ శైలిని వదిలించుకుని సహజ జీవితాలకై తరలకుంటే దారుణమైన పరిస్థితుల్లో పడతాయన హెచ్చరిస్తోంది.

మానవజాతి యుగయుగాల పరిణామాలను దాటుకుంటూ నేటి నవీన కాలానికి చేరింది. ఈ పథంలో నాటి నుండి నేటికి జరిగిన ప్రయాణంలో ఎన్నో అభివృద్ధులు జరిగినా మనిషెంత బుద్ధిశాలో తెలుస్తున్నా కొన్నింట మాత్రం తిరోగమించాడు. అటువంటిదే పర్యావరణ కాలుష్యం. ఇది ఎంతటి తీవ్రస్థాయిలో ఉందంటే మనిషితో పాటు సమస్త భూగోళం ముప్పుల్లో పడింది. దానికి సాక్ష్యం హవీస్ పాత్ర యొక్క ఆరోగ్యంలో చోటు చేసుకున్న పెను సవాళ్ళు. ముఖ్యంగా పట్టణీకరణ, పెరిగే జనాభా వంటివి, ఆధునిక పరికరాలు, రకరకాల పరిశ్రమలు అన్ని రకాల కాలుష్యాలను పెంచి పోషిస్తున్నాయి. మనిషి కూడా పూర్వపు ఆరోగ్యకరమైన ఆహారాన్ని కాకుండా సమయం ఆదా అవ్వాలని, బద్ధకానికి అలవాటుపడ్డాడు. సౌకర్యాలను కోరుకుని కృత్రిమ తిండికి పోషకాలు లేని రుచిరకాలకు తలవంచాడు. ఇవన్నీ ముందుగా వ్యాధి నిరోధకత తక్కువగా ఉన్న వారిపై ప్రభావం చూపి వారి నిండు నూరేళ్లను తగ్గిస్తూ అనారోగ్యాల పాలు చేస్తున్నాయి. పట్టణంలో ఇలాంటి తీరుతోనే క్షయ రోగాన్ని బాల్యంలోనే హవీస్‌కి సంక్రమించింది. ఎన్నో జబ్బులతో ఊపిరాడని అతడిని పల్లెకు తీసుకెళ్ళి సాంప్రదాయ పద్ధతుల్లో ప్రకృతి స్వచ్ఛతలతో ఆరోగ్యవంతుని చేసిన భద్రయ్య తన కొడుకు సుందరంతో చెప్తోన్న మాటల్లో పర్యావరణ చైతన్యం చోటుచేసుకుంది.

"ఆ సూర్య భగవానుడు ఆయనకి తోడుగా ఈ చెరువు నీళ్ళు ఈ చెట్ల గాలి 'ఈ ప్రకృతిని మనం గౌరవిస్తే' మన ఆరోగ్యం ఆ ప్రత్యక్షదైవమే కాపాడుతాడురా!"

మనిషి ప్రకృతిలో జీవిస్తూ పర్యావరణాన్ని కాపాడుకుంటూ సాగితే అతడికి అనారోగ్యమన్నది రాదు. రచయిత పల్లె వాతావరణాన్ని చూపుతూ ప్రకృతితో కలసి జీవించే జీవనం గురించి ప్రత్యేకించి చెప్పారు. శ్రమైక జీవనాన్ని పర్యావరణంతో కలసి సాగించేదే ఆరోగ్యకరమని దీని అర్థం. ముఖ్యంగా సూర్యరశ్మి శరీరానికి సోకుతూ నడక, బలవర్ధక ఆహారం, ప్రకృతి లభ్యాల వినియోగాలతో ఉండగలగాలి. అలా ఉండటానికి కలుషితాల మధ్య కాకుండా పచ్చదనాల మధ్య ఉండాలి. ఇవన్నీ పట్టణ వాసాల్లో కరువు కనుక అనారోగ్యాలు అధికం. పైగా మనిషి కూడా తన సహజ జీవన విధానాన్ని వదిలి 'రెడీమేడ్'కి అలవాటు పడటం అసలు సమస్య. అదే ఆధునికత, వెసులుబాటు, సుఖ ప్రదాయకం అనుకునే దృక్పథాలు ఏ ఆచరణలు మంచివో ఏవి కావో ఆలోచించటం మానేసాయి. దీన్ని తెలిపే క్రమంలో రచయిత పట్టణాలు, పల్లె రెండిరటి మధ్య జీవన భిన్నాలను పోలుస్తూ చెప్పటంలో పర్యావరణ ప్రాముఖ్యాన్ని కూడా జత చేసారు. మనిషికి చుట్టూ పచ్చని పంచభూతాలతో కూడిన స్వచ్ఛ వాతావరణం ఉండాలి. అన్నింటి కలుషితం లేని శుద్ధత ఆరోగ్య ప్రదాయకం. ఒకప్పుడంతా గ్రామీణ జీవితం. కష్టపడి వేకువజామున లేచి సూర్యనమస్కారాలు, పొలాలకు నడక, శారీరక శ్రమతో కూడిన దైనందిక కార్యకలాపాలు పండ్లు, కూరలు, చిరుధాన్యాలతో భోజనాలుండేవి. నేడు ఎండ కన్నెరగని ఎ.సి. గదులు, వేళాపాళా లేని నిద్ర వంటపనులు లేని డబ్బాల తిండి, మీట వేస్తే అయ్యే పనులు, ప్యూరిఫైయింగ్ షాంపూలు, సెంట్లు, తలుపులు బిగించిన ఇళ్ళు, రేడియేషన్‌ని పెంచే పరికరాలు పచ్చదనాలెరగని ఆవాసాలు పెట్రోల్, కార్బన ఉద్గారాల వాహనాలు. ఒకటి అని కాక అన్నీ కాలుష్యాలపాలు చేసి వినాశనాన్ని ఏరి కోరి తెచ్చిపడేసేవి. వాటి మధ్య నివసించటం మనిషి అంతర్గత, బాహ్య అవయవాలపై ప్రతికూలతలను కలిగిస్తాయి. అందరూ వాడుతున్నారు, మేమూ ఆ బాటే' అంటే అంతా రోగాల కుప్పలు, పల్లెలు అలా కావు. ఇక్కడి నిత్య జీవితం ప్రకృతితో ప్రారంభమై ప్రకృతితో మమేకం చేస్తుంది. పట్టణ, పల్లె జీవితాల్లో హవీస్ విషయంలో రుజువైంది. ప్రకృతి మధ్య సూర్యశక్తి స్పర్శని

నిరంతరం అందుకుంటూ ఆసగే విధివిధానాల్లో చురుకుదనం, రోగనిరోధక శక్తి ఉంటాయి. అపూర్వమైనవి ఇలా పర్యావరణంలో సహజంగా దొరుకుతున్నపుడు దాన్ని వదిలి కృత్రిమ అనారోగ్యాలవైపు పరిగెత్తటం తగనిది అని స్పష్టపరిచారు. కథల్లో పల్లె పచ్చదనాల స్వచ్ఛత, పట్టణ కాలుష్యాల కాసారాలు పోల్చి చెప్తూ పర్యావరణ విశిష్టతలు తెలిపారు.

నవీన కాలంలో పట్టణ వాసాలు తప్పనివి అయినా, కాలుష్యాలను తగ్గించే వాడకాలను అనుసరించాలి. నీటి, వాయు కాలుష్యాలను తగ్గించి విషవాయు ప్రభావాలను నిరోధించేవే చెట్ల పెంపకాలు నేడు అవి అవసరం. వర్షాలు పడటం, నేల కోతలు నిరోధం వంటివి చెట్ల ద్వారానే జరిగే ప్రక్రియలు. అలాగే వాతావరణం వేడెక్కి పోకుండా పర్యావరణ సమతుల్యత పాటించబడుతుంది. ఒకప్పుడు రూపాయి ఖర్చులేకుండా ఆదిత్యుని ఎదుట సూర్య నమస్కారాల పేరడి విటమిన్‌తో పాటు, వ్యాయామాన్ని పొందేవారు. శరీరం, మనసు సేదతీరే ప్రశాంతత ఉండేది. ఇప్పుడు 'జిమ్ సెంటర్ల' చుట్టూ తిరిగి లక్షలాది డబ్బు వృధా చేసుకుంటున్నారు. ఇవన్నీ కాల మార్పులుగా మనిషి చెప్పుకుంటున్నా విలాసాలకు, సౌకర్యాలకు, సోమరితనాలకు బానిసగా మారాడు. కాలు బయట పెట్టక సర్వసుఖాలు డబ్బుతో వస్తాయని అనారోగ్యాలు తెచ్చుకుంటున్నాడు. ప్రకృతి ప్రాముఖ్యతని ఆయుర్వేద గుణ సమ్మిళిత వినియోగాలు నిర్లక్ష్యం చేసాడు. ఈ క్రమంలో రచయిత వేదాలు ఆరోగ్యానికి సూర్యభగవానుడిని ఆశ్రయించమన్నాయని కానీ భారతీయులు పెడచెవిన పెట్టారంటూ సూటిగా మందలించారు. అదే విజ్ఞానాన్ని ఫ్రెంచ్ శాస్త్రవేత్తలు హీలియోథెరపీ అంటూ రవికిరణాలను ఒడిసిపట్టారని తెలిపారు. ఎప్పుడూ పెరటి మందుని తక్కువ చేయొద్దంటూ సాంప్రదాయ పూర్వ ప్రకృతి సంపదల్ని కాపాడి స్వీకరించమని విశదపరిచారు. పర్యావరణాన్ని సంరక్షించుకుని శుద్ధ ప్రకృతి జీవనం వైపు మరలగలిగితే కాలుష్యాలు లేని పంచభూతాలతో కూడిన పర్యావరణం ఆయుఃప్రమాణాలను పెంచగలదన్న వాస్తవాన్ని గుర్తింపజేసారు. మనం ప్రకృతిని కాపాడుకుంటే ప్రకృతి మనల్ని కాపాడుతుందని తెలిపిన కథతో పర్యావరణ సంబంధిత ఉపదేశాన్నిచ్చారు. మనిషి పర్యావరణాన్ని కాపాడుకున్నంతకాలం మాత్రమే అతని మనుగడ ఉందని కనువిప్పునిచ్చేలా తీర్చిదిద్దారనిపించింది.

## మాకేం మిగిల్చారు నాన్నా? - కథ

దేశ స్వాతంత్ర్యం కనుచూపుమేరలో ఉన్నపుడు గ్రామజీవిగా గౌరీవరప్రసాద్ స్వచ్ఛమైన ప్రకృతి, పర్యావరణాల్లో ఆనందం, ఆత్మీయతల మధ్య జీవిస్తాడు. పట్నం ఉద్యోగంకై తరలిపోతున్న అతడిని అతడి కన్నవారు వ్యవసాయమే ముద్దని చెప్తున్నా వినిపించుకోడు. స్థల వ్యాపారాలతో ఆస్తులు, అంతస్తులు కూడబెట్టి ఎదుగుతాడు. అతని కొడుకు భానుప్రకాష్ ఖరగ్‌పూర్ ఐఐటి చదువు, బొంబాయిలో వ్యాపారాలు అంటూ తండ్రి వద్దంటున్నా ఆగక వెళ్ళి పెద్ద పారిశ్రామికవేత్తగా మారుతాడు. ఆ తరానికి సముద్రాలు, కొండలు, అడవులు తరిగి సమాజ జీవన చిత్రమే మారిపోతుంది. విజృంభించిన రోగాల కాలంలో అతని కొడుకు స్వయంప్రకాష్ లాభాలనెంచి ఔషధ, రసాయన పరిశ్రమలకు అధిపతి అవుతాడు. తిండి, నీరు, గాలి తరించి కృత్రిమ ఆహారం, ప్రాణవాయువులతో బతకాల్సిన అవసరాలేర్పడతాయి. చుక్క నీరు లేక తల బయట పెట్టలేని ఎండలు, రోగాలతో జనజీవనం అల్లాడుతుంది. పండ్లు, కాయలు, చెట్లు ఆ తరం ఎరగదు. అన్నీ పుస్తకాల్లో బొమ్మలై మాయమవుతాయి. స్వయంప్రకాష్ కొడుకు భావేష్ వైద్య పరిశోధకునిగా, పలు వ్యాధులకు చికిత్సలు తప్ప నివారణలు

ఎందుకు లేవని మదనపడతాడు. ఒక వృద్ధ పరిశోధకునితో సాగి చర్చ ఫలితంగా గత జీవనం ఎలాంటిదో తెలుసుకోదలుస్తాడు. తరాల ముందు పర్యావరణ ఔన్నత్యాలెలాంటివో తెలుసుకుంటాడు. అప్పటికీ 2100 సంవత్సరానికి అడుగిడి స్వచ్ఛత అన్నది కోల్పోయి రోగాలను తప్ప మిగిలిందేం లేదు. తమ తరానికి అసలు ద్రోహం చేసింది ముందు వారేనంటూ తండ్రిని నిలదీసి ఆక్రోశిస్తాడు.

## విశ్లేషణ

పర్యావరణ సమస్యల చర్చని ఈ కథ సంపూర్ణంగా నిర్వర్తించింది. పర్యావరణానికి చేటు తెస్తున్న మనిషి ఇలాగే చేస్తూ వెళితే జీవం యావత్తూ తుడిచిపెట్టుకుపోగలదన్న హెచ్చరికని సమస్త మానవాళికి చేసింది. ఈ క్రమంలో చరిత్రనీ, వర్తమానాన్నీ, భవిష్యత్తుని దర్శింపజేస్తూ మానవ తప్పిదాలు పర్యావరణాన్ని కాలుష్య కాసాగారంగా మార్చాయని వివరించింది. నీరు, నేల, గాలిలోని స్వచ్ఛతలనెలా నేలకూల్చాడో చెప్తూ, తాను కూర్చున్న కొమ్మని తానే నరుక్కొంటున్నాడన్న నిజాన్ని వెల్లడిరచింది. ఈ కథలోని పర్యావరణ సమాచారం సంపూర్ణమైనదిగా ఉండి ఈ ఒక్కకథే ఓ పర్యావరణ పరిశోధనా గ్రంథానికి సరిపడా సమాచారంతో ఉందనటంలో అతిశయోక్తి లేదు. తరాలుగా మనిషి అభివృద్ధిని చేపట్టి డబ్బు సంపాదన అంటూ తన అత్యాశలకు ప్రకృతి వినాశనకారిగా మారాడు. తాను బాగుపడితే చాలని పర్యావరణం ఏమైనా పర్లేదనుకునే దోపిడీకారునిగా భవిష్యత్‌కి సహజ సంపదలను, జీవ సౌభాగ్యాలను కాకుండా కృత్రిమ బతుకులనిస్తున్నాడు. ఎంత తవ్వినా తరగని ఒక అపూర్వ ప్రకృతినిధిని కూకటి వేర్లతో పెకలిస్తూ చేస్తోన్న దమనకాండ సమస్త భూమండలాన్నీ కార్చిచ్చులా దహించివేస్తోంది. మనిషి పర్యావరణ విశిష్టతల్ని అందుకుంటూ ఆ వారసత్వాన్ని భవిష్యత్ తరాలను పొందనీయక పొందకుండా అడ్డుకట్టని వేస్తున్నాడు. దాని ఫలితం చాలా దారుణంగా ఉంటుందన్న వాస్తవాన్ని ఈ కథ తెలిపిన తీరులో ఓ ‘ఎన్‌సైక్లోపీడియా’ దాగుంది.

సౌకర్యాలు, అభివృద్ధులు లేనికాలమే అయినా గతమెంతో ముద్దు. నాటిమనిషి శ్రమ జీవితాన్ని ప్రకృతితో మమేకమై కొనసాగించాడు. అందులో అన్ని విధాలా మంచి దాగుంది. అది జీవావళి బాగుని కోరింది. అపుడు ప్రకృతిలోని పంచభూతాలే మనిషికి దైవం. కానీ తర్వాత కాలంలో మనిషి దయ్యంగా మారి అభివృద్ధి అనే పేరు మీద వాటిపై సాగించని విధ్వంసాలు లేవు. ధనసంపదలకై ప్రకృతిని సర్వనాశనం చేసే పెత్తనంతో సాగిస్తోన్న విలయకాండలకు పర్యావరణ విపత్తులు ముంచెత్తి కన్నెర్రజేసే సమాధానాలవుతున్నాయి. రచయిత ఒక కుటుంబపు తరాలతో పాటు మారుతున్న కాలాన్ని చూపుతూ పర్యావరణం ఎలా నాశనం అవుతూ వస్తోందో తెలిపారు.

ఇదంతా మన సమాజంలో జరిగిన, జరుగుతోన్న జరగబోయేదిగా అన్వయించి యదార్థాన్ని గోచరింపజేసారు. సహజ వనరులన్నవి లేక అంతా కృత్రిమమైన విధానంలో బతుకుతోన్న భావేంద్ర ఆవేదనలో పర్యావరణం మనిషి చేతిలో ఎలా తయారైందో వ్యక్తమైంది.

“ప్రకృతిని మనిషి చెరబట్టి చెరిచితే, చివరికి ప్రకృతి వికటించి, వికృతరూపం దాల్చి, కోరలు చాచుకుని విరుచుకుపడి విధ్వంసం సృష్టిస్తే… దారీ తెన్నూ కానక, తన చుట్టూ తనే కాంక్రీట్ కారాగారాలు నిర్మించుకుని నీరు వేరు మరచి, ఆలి దారి మరచి, వెలుతురు మరచి, వేడికి మసియై మాడి వ్యాధుల బారిన పడుతూ… లేస్తూ దశాబ్దాలుగా పోగుపెట్టుకున్న డబ్బుని తింటున్నాడా?!”

సృష్టిప్రసాదమైన ప్రకృతిని మనిషి అన్ని విధాలుగా దోచటం అనేవి సర్వకాలుష్యాలకూ కారణం. తత్ఫలితంగా అంతా వినాశనమేనని ఈ మాటల్లో విశదంగా ఉంది. పల్లెలు, వ్యవసాయం వద్దని పట్టణ జీవితం వైపు మనిషి ఎప్పుడైతే మరలిపోయాడో పచ్చదనం మాయమైంది. పట్టణీకరణ కులవృత్తుల్ని, పల్లెల్ని, పాడి పంటల్ని, పచ్చని ప్రకృతిని ఆక్రమించి స్వాహా చేసింది. గౌరీవరప్రసాద్ తరంలో దీనికి బీజాలు పడిరది. పర్యావరణాన్ని పట్టణీకరణ కూల్చి భానుప్రకాష్ తరంలో పారిశ్రామికీకరణ అన్నది ప్రవాహమైంది. ఎక్కడ చూసినా చెట్లు కూల్చబడి వాయు, జల, వాతావరణ, భూ కాలుష్యాలు వెల్లువెత్తాయి. ఫలితంగా స్వయంప్రకాష్ తరంలో పూర్తిగా సహజ వనరులు మాయమైపోయాయి చెట్లు అనేవి లేనపుడు స్వచ్ఛమైన గాలి, నీరు మాయమైపోగలవు. వానలుండవు, పంటలుండవు విపత్తులు మాత్రమే ఉంటాయి. మనిషికి నాలుగు వైపులా పరిశ్రమలు వాటి ద్వారా వెలువడే విషతుల్యాలు చేసే బీభత్సాలుంటాయి. అలాంటప్పుడు చిన్న మొక్క కూడా మొలిచే ఆస్కారం లేక కృత్రిమ ఆక్సిజన్, దప్పికకు హావిట్ (దాహం తీర్చే మాత్రలు) గుళికలు, రసాయన ఎరువులు, కృత్రిమ వాతావరణంలో పెంచబడే పంటలు అవి కూడా సముద్ర జలాలతో పండినవి అవుతాయి. అడుగు బయటకు పెడితే మాడి మసైపోవాలన్నట్లున్న ఎండలు మండుతాయి. విపరీతమైన రోగాలు వాటికి లేని నివారణలు వెరసి గాలి, నీరు, చెట్టు, పండు కన్నెరగని భావేంద్ర తరానికి కృత్రిమ జీవితం. ఆరోగ్యం, ఆనందాలకు దూరం చేస్తూ తరానికి తరానికి మధ్య పెరిగిన అత్యాశకి పర్యావరణ విపత్తుల నడుమ మానవజాతి బిక్కుమంటుంది. ప్రకృతి సంపదపై కత్తి వేటు వేసి అది తన గుండెల్లో తనకుతానే గుచ్చుకుంటోన్న బాకు అని మానవాళికి భవిష్యత్తులో మనుగడ అన్నది ఉండదని చెప్పిన విధానంతో కథలో రాబోవు కాలాన్ని తెలిపారు. మనిషికి ఆత్మప్రబోధాన్ని చేస్తూ ఆ రోజుల్ని కోరి తెచ్చుకోకుండా కళ్ళు తెరవాలి అందుకై పర్యావరణ హితం గురించి వివరిస్తూ పరిరక్షణలు చేపట్టాలని కథ ద్వారా ఆకాంక్షించారు.

ఒక హెచ్చరిక ఎపుడూ ఓ సమస్యని గుర్తింపజేయటానికే. అలాగే ఆ సంకటానికి దోహదమైన హేతువులను వెలికితీయటానికే, తద్వారా తప్పుని ఎత్తిచూపి సమస్యని అలాగే కొనసాగిస్తే అది మరింత జటిలం అవుతుందని తెలపటానికే పరిష్కారం మార్గాలవైపు కదిలించి రాబోవు విపత్తులను ఏ కొంతైనా ఆపగలగాలన్న ఈ పర్యావరణ కథ యొక్క ముఖ్య ఉద్దేశ్యం. మనిషి తన స్వార్థ ప్రయోజనాలకై తీసుకునే నిర్ణయాలు కాలుష్య కారకాలై స్వచ్ఛమైనది అన్నది పూర్తిగా మాయమైపోతోంది. క్రమంగా అంతరిస్తున్న నీటి వనరులు, కుంచిచుకుపోయిన పంటపొలాలు, అటవీ సంపదతోనే అంతరించిపోతోన్నవి. మనిషి ఆదాయ వనరులు అని ప్రకృతిపైబడి చేసిన దోపిడీల ఫలితం. ఇదంతా అభివృద్ధి అని మభ్యపెట్టుకుంటూ ఆటవిక దశ నుండి నేటి వరకూ జరిగిన మానవ పరిణామ క్రమంలో పురోగమనంలో భాగమని భవిష్యత్ తరాలకు చెప్పుకుంటే అది సిగ్గుచేటు. అభివృద్ధి చెందాలని వినాశనానికి పర్యావరణాన్ని గురిచేసే హక్కు మనిషికి లేదు. కేవలం స్వార్థం, అత్యాశ, పెత్తనం అంటూ కోట్ల వైపు పరుగులు తీస్తే ఆ కోట్లు కోటానుకోట్ల విషనాగుల పడగల్లై భవిష్యత్ తరాలపై హాలహలాన్ని కక్కుతాయి. అప్పుడు భవ్యేంద్రలా మన పిల్లలూ “మీవికానివాటిని మీరు దోచుకున్నారు, ధ్వంసం చేసారు. మీ తరాలన్నీ భావితరాల సుఖశాంతుల్ని, ఆరోగ్యాన్ని దోచుకున్నాయి'అని మునుముందు రాబోవుతరాలను నిలదీస్తే తట్టుకోగలమా?! ‘ఎవరిచ్చారు మీ తరాలకు, ఆ అధికారం. డబ్బు తిని బతగ్గలమా? ఆ

విషయం తప్ప మాకేం మిగిల్చారు?!' అంటే సమాధానం చెప్పుకోగలమా? కానీ ఆ రోజు వైపుకి మనిషి ప్రయాణిస్తూ వెళ్తున్నాడు. నిన్నది నేడు మాయం, నేటిది రేపటికి మాయం. మరి మనం వారసత్వంగా ఇస్తోందేంటి? అని ప్రతీ ఒక్కరినీ సమీక్షించుకునేలా ఈ కథ ప్రకృతి క్షోభని ఇకనైనా ఆపాలని పిలుపునిస్తోంది. తెలిసి తెలిసి చేసే మానవ తప్పిదాలకు శిక్ష రేపటి తరాలకు పడకూడదు. అందుకే పర్యావరణ అవగాహనలతో మెలగాలన్న కథలోని ప్రతీ అక్షరంలోనూ ప్రకృతి ప్రేమికుని హృదయ వేదన వెల్లువలైంది. తల్లిలాంటి ప్రకృతిని కాపాడుకోవాలన్న తపనకి ఈ కథ వేదికైంది. ఎన్ని పర్యావరణ చట్టాలొచ్చినా పరిస్థితులు దిగజారటం వెనకున్నది మనిషే. అతని తప్పిదాల నుండి గాలి, నీరు, అడవులు, కొండలు, సముద్రాలు, నేల, నింగి, పక్షులు, జంతువులు, సహజ వనరుల యావత్తూ సంరక్షించబడాల్సిన అవసరాన్ని గుర్తింపజేసారు.

ఆధార గ్రంథాలు :


1) శివకుమార్, పి.వి.ఆర్. (2019). కిరణం కథా సంపుటి. హైదరాబాద్: పాలపిట్ట బుక్స్.

2) వెంకట సుబ్బయ్య, వల్లంపాటి. (2016). కథాశిల్పం. విజయవాడ: విశాలాంధ్ర బుక్‌హౌస్.

3) దక్షిణామూర్తి, పోరంకి. (2009). కథానిక స్వరూపస్వభావాలు. హైదరాబాద్: నవోదయ పబ్లికేషన్స్.